క్లుప్తంగా

'ఆది'కి ఆహ్వాన పత్రిక అందజేత



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గౌడ కులస్తులు

వేములవాడరూరల్: మండలంలోని వట్టెంల గ్రామానికి చెందిన గౌడ కులస్తులు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను బుధవారం తన నివాసంలో కలిశారు. ఎల్లమ్మ సిద్ధోగం వేడుకలకు మంగళవారం హాజరుకావాలని ఆహ్వానించారు. ఇక్కడ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు మంద నారాయణ, పొన్నం ధర్మయ్య, దుర్గయ్య, చంద్రయ్య తదితరులున్నారు.

శుభకార్యాలకు హాజరు

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం జిల్లా కేంద్రం సిరిసిల్లలో పర్యటించారు. పెద్దూరు, సిరిసిల్ల పట్టణాల్లో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు నిర్వహించిన శుభకార్యాల్లో పాల్గొన్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, గడ్డం నర్సయ్య, సూర దేవరాజు, మ్యాన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్ల: పట్టణంలోని పలుప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ సెస్ ఏఈ మధుకర్ శుక్రవారం తెలిపారు. పట్టణంలో 11కేవీ లైన్ మరమ్మతు పనులు, విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్, శ్రీనగర్‌కాలనీ, దోబీగల్లీ, అంబేడ్కర్ నగర్, సిద్ధార్థనగర్, పోచమ్మ స్ట్రీట్, మార్కండేయ వీధి, భావనా రుషినగర్, విద్యానగర్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 7గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని సెస్ ఏఈ కోరారు.

నేతన్నలకు బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న అరుకాల రమేశ్

సిరిసిల్లటౌన్: ప్రభుత్వం నేతన్నలకు బకాయిలను చెల్లించాలని బీఎస్పీ పట్టణ అధ్యక్షుడు అరుకాల రమేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల కోడ్‌తో కాంగ్రెస్ ప్రభుత్వం తాత్సారం చేయొద్దని, కాంగ్రెస్ పెద్దలు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల పక్షాన పోరాడేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. నాయకులు రమేశ్, మేర్గు శ్రీనివాస్, కమలాకర్, ఆంజనేయులు, శ్రీనివాస్, వెంకటేశం, రాజు, నరేశ్ పాల్గొన్నారు.

బాలబాలికలకు క్రీడాశిక్షణ శిబిరాలు

కోనరావుపేట: మండల పోలీస్‌స్టేషన్ పరిధిలోని 14 ఏళ్లు పైబడిన బాలబాలికల కోసం ఉచిత వేసవి క్రీడాశిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు వాలీబాల్, కబడ్డీ, పెయింటింగ్, అబాకస్, కరాటే, యోగా, అర్చరీ, డ్యాన్స్, మార్షల్ ఆర్ట్స్, అథ్లెటిక్స్‌లో మే 1 నుంచి 31 వరకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకు పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 26–29 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అన్ని గ్రామాల బాలబాలికలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పుస్తెమెట్టెలు అందజేత



పుస్తెమెట్టెలు అందజేస్తున్న డెయిరీ సభ్యులు

వీర్నపల్లి : మండలంలోని సీతారాంనాయక్ తండాకు చెందిన బానోత్ రమేశ్ కూతురు అర్చన వివాహం శుక్రవారం జరగగా కరీంనగర్ పాల డెయిరీ సభ్యులు పుస్తెమెట్టెలు అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు భూక్య రాజేందర్ సూపర్‌వైజర్ నాగరాజు, మాజీ సర్పంచ్ రవి నాయక్, ఎంపీటీసీ పద్మ సెవ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని కోరుట్లపేట మాజీసర్పంచ్ మేడిపల్లి దేవానందం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టగా పార్టీ కార్యాలయంలో శుక్రవారం నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారను. పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు లింగంగౌడ్, వంగ గిరిధర్ రెడ్డి, బాల్‌రెడ్డి, చెన్నిబాబు, రాజు నాయక్, రాంరెడ్డి, ఆంజనేయులు, పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరేనా?

- పలుగ్రామాల్లో అసంపూర్తిగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు
- ఏళ్ల క్రితం ప్రారంభించినా నత్తనడకన పనులు
- అద్దె ఇళ్లలో పేదల అవస్థలు



కొండాపూర్‌లో అసంపూర్తిగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు

ముస్తాబాద్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు ఇంకా పూర్తి కా లేదు. టెండర్లు పూర్తయి కొన్నిచోట్ల కాంట్రాక్టర్లు ముందుకురాకపోవడంతో, లబ్ధిదారులే స్వయంగా కొన్నిగ్రామాల్లో సొంతింటి కలను నేరవేర్చుకుంటున్నారు. మండలంలో గత పదేండ్లలో 551 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరుచేశారు. ఇందులో కొండాపూర్, గూడెంలో పనులు నత్తనడకన సాగుతున్నాయి.

ఏళ్లక్రితం ప్రారంభించినా..

ముస్తాబాద్ మండలంలోని కొండాపూర్, గూడెం గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతుంది. కొండాపూర్‌లో 40 ఇళ్లు, గూడెంలో 50 ఇళ్ల నిర్మాణాలకు ఏడేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. ప్రత్యేక బ్లాక్‌లుగా చేసి చేపట్టిన పనులు ఒక అడుగు ముందుకు రెండడుగుల వెనక్కి అన్న చందంగా సాగుతున్నాయి. గూడెంలో ఐదేళ్లగా స్థలం సమస్య ఉండటంతో పనులు ప్రారంభం కాలేదు. చివరకు గుట్ట ప్రాంతంలో చేపట్టిన పనులు చివరిదశలో ఉండగా ఎన్నికల కోడ్ అడ్డుగా మారింది. దీనికి ప్రత్యేకంగా నిధులు మంజూరుకానుండగా ఎన్నికల కోడ్‌తో ఆగినట్లు అధికారులు తెలుపుతున్నారు. కొండాపూర్‌లో ఏడేళ్ల క్రితం నారాయణపూర్ దారిలో 40 ఇళ్ల నిర్మాణానికి పనులు చేపట్టారు. నాలుగు బ్లాక్‌ల్లో చేస్తున్న పనులు పూర్తికావడం లేదు.

సొంత స్థలాల్లోనే..

ప్రభుత్వ భూములు లభించని చీకోడులో 50 ఇళ్లు మంజూరు చేయగా, ఇక్కడ ఆరుగురు మాత్రమే సొంత స్థలంలో ఇళ్లపనులు ప్రారంభించారు. మిగతా 44 రద్దయ్యే అవకాశం ఉండగా మొర్రాయిపల్లెలో 24 ఇళ్లు మంజూరుకాగా స్థల సమస్యతో ఒక్క ఇళ్లు కూడా నిర్మించలేదు. తుర్కపల్లిలో 25 మంజూరు అయితే, ఇక్కడ దాదాపు అందరినీ మోటివేట్ చేసి ఇళ్లు నిర్మించుకునేలా మాజీ సర్పంచ్ ప్రోత్సహించి పూర్తి చేయిస్తున్నారు. బందనకల్‌లో 40 ఇళ్లకు కేవలం 16, వెంకట్రావుపల్లెలో 20 ఇళ్లకు కేవలం మూడు మాత్రమే ప్రారంభించారు. సేవాలాల్ తండాలో 20 ఇళ్లు మంజూరు చేస్తే పది మంది ఇళ్లు నిర్మించుకుంటున్నారు.

స్థల కొనుగోలుకు రూ.15లక్షలు

ఆవునూర్‌లో ఇళ్లులేని పేదలకు అప్పటి ప్రభుత్వం 50 ఇళ్లు మంజూరు చేసింది. ప్రభుత్వ స్థలం లేకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఈలోగా అర్హుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. రోడ్డు విస్తరణలో ఎక్కువగా ఇళ్లు నష్టపోయిన వారికి సైతం డబుల్ బెడ్ రూం ఇస్తామని హమీఇచ్చారు. స్థలం కోసం కేటీఆర్ స్వయంగా రూ.15లక్షలు చెల్లించారు. ఓ రైతు వద్ద రెండెకరాల రూ.33లక్షలకు కొనుగోలు చేశారు. కేటీఆర్ రూ.15లక్షలు ఇవ్వగా, పంచాయతీ నుంచి రూ.8లక్షలు చెల్లించారు. జెడ్పీటీసీ నర్సయ్య, మాజీ సర్పంచులు కల్యాణి, సత్తమ్మ, లబ్ధిదారులు చెల్లించారు. రైతుకు మొత్తం డబ్బులు చెల్లించినా దానిని రిజిస్ట్రేషన్ చేసుకోలేదు. ఈలోగా ప్రభుత్వం మారగా ఆ స్థలం అలాగే ఉంది. ఇళ్లులేని వారు ఇందిరమ్మ కాలనీలో, సొంత స్థలాల్లో 16 మంది పనులు ప్రారంభించారు. ప్రభుత్వం ఇళ్లు నిర్మించాలని ఏడాది క్రితం ఆందోళన చేపట్టినా అధికారులు పనులు చేపట్టలేదు.

అద్దె ఇళ్లలో ఇబ్బంది

ఆవునూర్, కొండాపూర్, గూడెం, బందనకల్, తెర్లుమద్ది, వెంకట్రావుపల్లె, మొర్రాయిపల్లె, కొండాపూర్ గ్రామాల్లో ఇళ్లులేని వారు అద్దె ఇళ్లు, రేకుల షెడ్లలో కాలం వెళ్లదీస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు మధ్య సమన్వయం లోపంతో పేదల సొంతింటి కల నేరవేరడం లేదన్న ఆరోపణలున్నాయి. మోహినికుంట, మద్దికుంట, ముస్తాబాద్, పోతుగల్, చిప్పలపల్లి గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనులు చేసి పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందించారు.

పదేళ్లైనా పూర్తి కాలే



కొండాపూర్‌లో పదేళ్లుగా డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అసంపూర్తి పనులతో పేదలు ఆ ఇళ్లలోకి వెళ్లలేకపోతున్నారు. విద్యుత్ , తాగునీరు, డ్రైనేజీ పనులు చేపట్టలేదు. ప్లాస్టరింగ్ పనులు ఇంకా ఉన్నాయి. ఫ్లోరింగ్ చే యలేదు. కొంతమంది పేదలు అద్దె ఇళ్లలో ఉంటున్నారు.

– చిగురు వెంకన్న, కొండాపూర్

ఒక్క ఇల్లు నిర్మించలేదు



ఆవునూర్‌లో ఎందరికో సొంతిళ్లు లేదు. 50 ఇళ్లు మంజూరైతే ఒక్క ఇల్లు నిర్మించలేదు. డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించాలని దీక్షలు కూడా చేపట్టాం. ఇళ్లకోసం కొనుగోలు చేసిన జాగ ఖాళీగానే ఉంది. కొంతమంది ఓపిక లేక ఇందిరమ్మ కాలనీలో ఇళ్లను నిర్మించుకుంటున్నారు.

– సొల్ల లలిత, ఎంపీటీసీ, ఆవునూర్

త్వరలోనే పూర్తిచేస్తాం



కొండాపూర్, గూడెం డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులను త్వరలోనే పూర్తిచేస్తాం. సెప్టిక్ ట్యాంక్ నిర్మాణాలకు నిధులు వచ్చాయి. ఎన్నికల కోడ్‌తో జాప్యం జరుగుతోంది. సొంతస్థలంలో నిర్మించుకునే వారికి బిల్లులు చెల్లిస్తాం. పనులు మొదలు పెట్టని దాదాపు 110 ఇళ్లు రద్దయ్యే అవకాశం ఉంది.

– నరేందర్, ఏఈ ఆర్అండ్‌బీ, ముస్తాబాద్

నేతన్నలకు అండగా ప్రభుత్వం



మాట్లాడుతున్న ప్రవీణ్ జే టోని

తంగళ్లపల్లి: నేతన్నలు అధైర్యపడొద్దని, ప్రభుత్వం ఆదుకుంటుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వైట్‌హౌజ్‌లో ఆయన మాట్లాడారు. నేతన్నలకు బీఆర్‌ఎస్, బీజేపీ చేసిందేమీ లేదన్నారు. సిరిసిల్ల రావాల్సిన మెగా టెక్స్‌టైల్ పార్కును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేరే చోటికి తరలించిందని, నేతన్నలకు రూ.300 కోట్లు బకాయిలను చెల్లించకుండా రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. చేనేత రంగం అభివృద్ధికి కాంగ్రెస్ కృషిచేస్తుందన్నారు. నేతన్నలు ఆత్మహత్యలు చేసుకోవద్దని ఏడాది పొడవునా కార్మికులకు పని కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ కార్యాచరణ రూపొందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వైద్య శివప్రసాద్, పూర్మాని రాంలింగారెడ్డి, శ్రీకాంత్ గౌడ్, కావటి మల్లేశం, చుక్క రాజశేఖర్, ప్రశాంత్, సాయికుమార్, శంకర్, కొత్త రవి, ఇక్బాల్, గుగ్గిళ్ల భరత్, అరెపల్లి బాలు, శ్రీనివాస్, సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

28న ప్రవేశ పరీక్ష

ఎల్లారెడ్డిపేట: తెలంగాణ రాష్ట్ర ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశాల కోసం ఈనెల 28న పరీక్ష నిర్వహిస్తున్నట్లు గిరిజన గురుకులాల ప్రాంతీయ సమన్వయాధికారి (రీజనల్ కో–ఆర్డినేటర్) వెంకన్న శుక్రవారం తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసిన విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నగదు పట్టివేత

చందుర్తి: ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.53వేల నగదును శుక్రవారం రాత్రి పట్టుకున్నట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మండలకేంద్రానికి చెందిన సాయి వంశీ నగదును వేములవాడకు తరలిస్తుండగా మర్రిగడ్డ శివారులో వాహనాల తనిఖీలో నగదు పట్టుబడినట్లు పేర్కొన్నారు. సీజ్‌చేసి ఎన్నికల అధికారులకు అప్పగించనున్నట్లు వారు పేర్కొన్నారు.

మానసిక రుగ్మతలకు చికిత్స

సిరిసిల్లటౌన్/సిరిసిల్ల కల్చరల్: పరీక్షలు సరిగా రాయలేదని, తక్కువ మార్కులు వచ్చాయన్న మానసిక సంఘర్షణతో ఉంటున్న విద్యార్థులకు ఉచిత చికిత్స అందిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ మోహన్‌రావు, మానసిక వైద్యుడు డాక్టర్ ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. చిన్న కారణాలతోనే కొందరు జీవితాన్ని మధ్యలోనే ఆపేస్తున్నారని ఇది సరైంది కాదన్నారు.పరీక్షలు మళ్లీ రాయొచ్చని కానీ జీవి తాన్ని మళ్లీ పొందలేమన్నారు. మానసిక ప్రతికూలత ఆలోచనలు, నిద్రలేమి, భోజనం సరిగా చేయని, ఒంటరిగా గడుపుతున్న పిల్లలను తల్లిదండ్రులు ఉత్సాహపర్చాలని సూచించారు. అవసరమైన వారికి చికిత్స కోసం 14416, 180042 533 33నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఆర్థికసాయం అందజేత

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం వల్లంపట్లకు చెందిన బీజేపీ కార్యకర్త ల్యాగల జలపతి ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబానికి బీజేపీ నాయకులు రూ.25 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఇక్కడ బీజేపీ మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి, తిప్పరపు శ్రవణ్, వజపల్లి శ్రీకాంత్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రుద్రంగి: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మండలకేంద్రానికి చెందిన అంబటి శశిధర్, మర్రిపెల్లి నడ్పి గంగారాం కుటుంబ సభ్యులను శుక్రవారం రాత్రి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించారు. ప్రభుత్వపరంగా అండగా ఉంటామని అన్నారు. ఆయనవెంట డీసీసీ కార్యదర్శులు చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, తర్రె లింగం, నాయకులు గండి నారాయణ, పల్లి గంగాధర్, దేశవేని శ్రీనివాస్, తదితరులున్నారు.

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ గ్రామానికి చెందిన బోయ గాలయ్య, పాక మమత ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాలను బీజేపీ నాయకులు శుక్రవారం పరామర్శించారు. మృతుల కుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యం అందజేశారు. ఇక్కడ వరి వెంకటేశ్, కోల కృష్ణ, చీకోటి మహేశ్,, తదితరులున్నారు.

ఇఫ్టూ జిల్లా కార్యవర్గం



ఐఎఫ్‌టీయూ కార్యవర్గం

సిరిసిల్లటౌన్: భవన నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) జిల్లా కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.విశ్వనాథ్, అధ్యక్షుడిగా పిల్లి లచ్చయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఏసిక మారుతి, ఉపాధ్యక్షుడిగా దమ్మని మొండయ్య, కోశాధికారిగా దుంపేటి కరుణాకర్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని తాజా, మాజీ అధ్యక్షుడు ఈర్ల రాజలింగం, పట్టణ అధ్యక్షుడు బెల్లె కనకయ్య అభినందించారు.

ధాన్యం రోడ్డు పాలు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యం బస్తాలను లారీలో లోడ్‌చేసి శుక్రవారం రైస్ మిల్లుకు తరలిస్తుండగా బస్తాలు కిందపడి ధాన్యం రోడ్డు పాలైంది. స్థానిక సాయి మణికంఠ ఫంక్షన్ హాల్ ముందు లారీనుంచి బస్తాలు కిందపడిపోయాయి. లారీ డ్రైవర్ గమనించక అరకిలో మీటర్ వెళ్లాడు. అనంతరం వాహదారులు చెబితే లారీని నిలిపివేశాడు.

నియామకం

బోయినపల్లి: బీజేపీ మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా స్తంభంపల్లి గ్రామానికి చెందిన బొంగాని మల్లేశంను నియమించారు. బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

సంక్షిప్త వార్తలు

వాహనాల తనిఖీ

బోయినపల్లి: మండలకేంద్రంలోని శుక్రవారం రాత్రి వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రూ. 50 వేలకు మించి నగదు తరలిస్తే తగు ఆధారాలు చూపాలని పేర్కొన్నారు. వాహనదారులు తమ వాహనపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎస్సై పృథ్వీధర్‌గౌడ్, హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య తదితరులు ఉన్నారు.

దమ్మన్నపేట మాజీ సర్పంచ్ మృతి

గంభీరావుపేట: మండలంలోని దమ్మన్నపేట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దుంపల చిన్న సాయిరెడ్డి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. గతంలో పార్టీ మండల అధ్యక్షుడిగా, ఉపసర్పంచ్‌గా పనిచేశారు. ఆయన మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు.

కుల బహిష్కరణ చేస్తే చర్యలు

ఎల్లారెడ్డిపేట: మండల పరిధిలోని గ్రా మాల్లో కుల సంఘాల పెద్ద మనుషులు ఎవరైనా సంఘంలోని సభ్యుల ను కుల బహిష్కరణ చేస్తే చర్యలు తప్పవని ఎస్సై రమాకాంత్ అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏదో కారణంతో కుల బహిష్కరణ చేయడం, కుల సంఘం సమావేశాలకు పిలవకపోవడం, జరిమానా చెల్లించాలని డిమాండ్ చేయడం, వారితో మాట్లాడకుండా ఇతరులను కట్టడి చేయడం లాంటి సంఘటనలు తమదృష్టికి వస్తే కుల సంఘాల పెద్ద మనుషులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఏమైనా సమస్యలుంటే పోలీసులను ఆశ్రయించాలన్నారు. మండల పరిధిలోని ప్రధాన రహదారులపై రైతులు ధాన్యం ఆరబోస్తే ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్లపై ధాన్యం ఆరబెట్టినట్లు ఫిర్యాదు వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఇటీవల రోడ్లపై ధాన్యం ఆరబోయడం వల్ల ప్రమాదాలు జరిగాయన్నారు.

కిరాణ దుకాణాలపై పోలీసుల దాడులు



తిమ్మాపూర్‌లోని కిరాణ దుకాణంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట: ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై వరుస దాడులు నిర్వహిస్తున్నారు. మండలంలోని రాచర్లతిమ్మాపూర్, బాకూర్‌పల్లితండాల్లోని కిరాణ దుకాణాలు, బెల్ట్ షాపులపై ఏఎస్సై కిషన్ రావు ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు తనిఖీలు చేశారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో కానిస్టేబుల్ రాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేత కార్మికులను పట్టించుకోని 'బండి'



మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్లటౌన్: కేంద్రంలోని బీజేపీ పదేళ్లుగా కార్పొరేట్ శక్తులకే కొమ్ముకాసిందని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. శుక్రవారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వ సంస్థలను అంబాని వంటి కార్పొరేట్లకు కట్టబెట్టిందని, రైతులు, కార్మికుల హక్కులు కాలరాసేవిధంగా నల్ల చట్టాలు తెచ్చిందన్నారు. ఎంపీగా బండి సంజయ్ ఏనాడూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ, ఇక్కడి నేత కార్మికుల సంక్షేమానికి కృషి చేయలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో ఆపార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. నాయకులు అజ్జ వేణు, సోమ నాగరాజు, కొంక విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు



ఎల్లారెడ్డిపేట: పూజలు చేస్తున్న అర్చకులు



ముస్తాబాద్ : అభిషేకం చేస్తున్న భక్తులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల తిమ్మాపూర్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నిత్యహవనం, బలిహరణం, నివేదన, తీర్థగోష్ఠి, విగ్రహాలకు పూజ, హోమం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, కొండూరు గాంధీరావు, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్లు కొండ రమేశ్ గౌడ్, అందె సుభాష్, నర్సింహరెడ్డి, ఎంపీటీసీ వరద బాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు బండారి బాల్‌రెడ్డి, రవీందర్, రాజేందర్, సురేశ్, అనిల్, వేద పండితులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని కొండాపూర్‌లో పోలేరమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. విగ్రహాలను సైంటిస్ట్ దంపతులు డాక్టర్ చిగురు ఆదిమలన్ బాబా, డాక్టర్ దేవథి అందించారు. నూతన ఆలయంలో అర్చకులు పోలేరమ్మ తల్లి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహ దాత డాక్టర్ ఆది మలన్‌బాబాకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చిగురు వెంకన్న, నిమ్మ రాజిరెడ్డి, కరుణాకర్, బాల్‌రెడ్డి, దేవిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

'సర్కారు వల్లే నేత కార్మికుల ఆత్మహత్యలు'



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న హరీశ్

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల నేత కార్మికులవి సర్కారు హత్యలుగా బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్ అభివర్ణించారు. 'నేతన్న మేలుకో' పేరుతో ముద్రించిన కరపత్రాలను ఆయన సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఎంతో అభివృద్ధి చేసి కార్మికులకు ఉపాధి కల్పించిందన్నారు. నేతన్నలపై కాంగ్రెస్ వ్యవహరిస్తున్న తీరు సరికాదన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ. 5లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మానాల అరుణ్, బాబా, రాహుల్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వినోద్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించండి



ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని హరిదాస్‌నగర్, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి బీఆర్‌ఎస్ నాయకులు ఓట్లు అభ్యర్థించారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిందన్నారు. వినోద్ కుమార్‌కు మద్దతుగా ఓటువేసి గెలిపించా లని కోరారు. సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు నర్సింహరెడ్డి, కిషన్, జబ్బర్, సుధాకర్ రావు, వెంకటయ్య, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

బైండోవర్ వ్యక్తులపై నిఘా

సిరిసిల్లక్రైం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు నేరచరిత్ర గల వారిని కౌన్సిలింగ్‌కు పోలీసు అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనిలో భాగంగా రెండు రోజులుగా సిరిసిల్లటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గతంలో బైండోవర్ అయిన దాదాపు 250 మందిని ఠాణాకు రావాలని ఆదేశించినట్లు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నేరాలు చేయకుండా, సత్ప్రవర్తనతో మెలగాలని తెలిపేందుకు సమావేశం ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికారుల్లో ఒకరు తెలిపారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



గంభీరావుపేట: మండలకేంద్రంలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న శ్రీ సీతారామస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. శుక్రవారం ఆలయంలో శేష హోమం, మహా పూర్ణాహుతి, బలిహరణం, ధ్వజ అవరోహణం, సప్తవర్ణాలు, ఏకాంతతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించారు.

మండుటెండల్లో అంగన్'బడి'

- చిన్నారులకు సెలవు ఇవ్వాలని డిమాండ్



సిరిసిల్లలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

సిరిసిల్లటౌన్: పెద్దలు సైతం తట్టుకోలేని విధంగా పెరిగిపోతున్న ఉష్ణోగ్రతల్లోనూ చిన్నారుల అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించలేదు. తీవ్ర ఉక్కపోతలోనూ తల్లిదండ్రులు పిల్లల్ని పంపించడానికి విముఖత చూపిస్తున్నారని అంగన్‌వాడీ ఎంప్లాయీస్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత, ఉపాధ్యక్షురాలు శ్యామల, కొండికొప్పుల పద్మ, నాగలక్ష్మి, అంజలి తెలిపారు. ప్రభుత్వ బడులు, కళాశాలలకు ఇచ్చిన విధంగానే సెలవులు ప్రకటించాలని కోరారు.

పథకాలను వివరించాలి



ఎల్లారెడ్డిపేట: ఎన్నికల ప్రచారంలో భాగంగా గడపగడపకూ ప్రచారం నిర్వహించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆరు గ్యారంటీలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఎంపీగా బండి సంజయ్‌కుమార్ చేసేందేమీ లేదన్నారు. ఈనెల 30న కార్నర్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు చెన్ని బాబు, గుడ్ల శ్రీనివాస్, పందిర్ల లింగంగౌడ్, బండారి బాల్‌రెడ్డి, దేవానందం, రాంరెడ్డి, మహేందర్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.